సాక్షి
కర్నూలు

శనివారం, 16, సెప్టెంబర్, 2023

న్యూస్‌రీల్

జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం

కర్నూలు(సెంట్రల్): జగనన్న సచివాలయ కన్వీనర్ల జిల్లా కోఆర్డినేటర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. కర్నూలు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్లుగా గెడి శ్రీనివాసులురెడ్డి, కొత్తకాపు సురేందర్ రెడ్డిలను నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విజయవాడకు జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన ఈవీఎం, వీవీప్యాట్‌ల నిర్వహణపై శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొననున్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల నిర్వహణపై ఎంపిక చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్‌ల పనితీరుపై ఫస్టు లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) కార్యక్రమాన్ని విజయవాడలోని గుప్తా కల్యాణ మండపంలో సివిల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు సీనియర్ సూపర్‌వైజర్ హోదాలో డీపీఓ నాగరాజునాయుడు హాజరు కానున్నారు.

ముగిసిన 'శ్రావణ' ఉత్సవాలు



గంగ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. తుంగభద్ర దిగువ కాలువలో గంగ పూజ నిర్వహించి, హారతిని వదిలారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ ముగిసింది. సాధారణంగా 5వ తేదీ వరకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేస్తారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు 23వేలకు పైగా కొత్త పింఛన్లు మంజూరు కావడంతో ప్రతి ఒక్కరూ పింఛను పొందాలనే లక్ష్యంతో ఈ నెల 14 వరకు పంపిణీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 2వ స్థానం లభించగా.. కర్నూలు జిల్లా 7వ స్థానంలో నిలిచింది. పింఛన్‌ల పంపిణీలో కర్నూలు, నంద్యాల జిల్లాలను ఉన్నత స్థానాల్లో నిలిపిన వార్డు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లను డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అభినందించారు.

29న వైఎస్ఆర్ చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ చేయూత కింద 45 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం నగదు విడుదల చేయనుంది. ఈ నెల 29న డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. గత ఏడాది 1.26 లక్షల మంది మహిళలకు వైఎస్సార్ చేయూత కింద రూ.18,870 ప్రకారం విడుదలైంది. ఈ ఏడాది లబ్ధి పొందే మహిళల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. వైఎస్ఆర్ చేయూత కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో వేలాది మంది వివిధ వృత్తుల్లో రాణిస్తుండటం విశేషం.

దేహదారుఢ్య పరీక్షల్లో 510 మంది ఎంపిక



దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఐజీ, కర్నూలు, కడప ఎస్పీలు

కర్నూలు: ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌లో 16వ రోజు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, కర్నూలు, కడప ఎస్పీలు కృష్ణకాంత్, సిద్ధార్థ కౌశల్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు శుక్రవారం 800 మందిని ఆహ్వానించగా 740 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను పరీక్షించారు. అనంతరం వారందరికీ శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించగా 1,600 మీటర్ల పరుగులో 601, 100 మీటర్ల పరుగులో 412 మంది, లాంగ్‌జంప్‌లో 489 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం అన్ని ఈవెంట్లలో 510 మంది అర్హత సాధించి మెయిన్స్ పరీక్షకు ఎంపికయ్యారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలిపాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ లిఫ్ట్ నుంచి ఈ నెల 19న చెరువులకు హంద్రీ–నీవా నీరు మళ్లించే పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని జేసీ తెలిపారు. లిఫ్ట్‌కు కిలోమీటర్ దూరంలో హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హెలిపాడ్, రహదారి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, డీపీఓ నాగరాజునాయుడు, ఇరిగేషన్ ఈఈ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆనందం

ఎవరి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రాలయం మండలంలో 5,710 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. సెప్టెంబర్ నెలలో అదనంగా 1,420 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. వీరంతా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా కొత్త పింఛన్లు అందుకున్నారు. – మంత్రాలయం

కాపు మహిళలకు ఆర్థిక ఆసరా

వరుసగా నాలుగో విడత కాపునేస్తం అమలు

- నేడు నిడదవోలు నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7,083 మంది మహిళలకు లబ్ధి
- జమ కానున్న రూ.10.62 కోట్లు



కర్నూలు(అర్బన్): కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలకు చెందిన పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపునేస్తం పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం కింద వరుసగా నాలుగో విడత నగదును శనివారం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయనున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కలెక్టర్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించనున్నారు. జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరుకానున్నారు. ఈ పథకం కింద ఒక్కో మహిళకు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 19,039 మంది లబ్ధిదారులకు రూ. 28,55,85,000 విడుదలయ్యాయి. కర్నూలు జిల్లాలో 3,827 మంది కాపు మహిళలకు రూ.5,74,05,000, నంద్యాల జిల్లాలో 15212 మందికి రూ.22,81,80,000లు జమ అయ్యాయి. ప్రస్తుతం నాల్గవ విడతలో రెండు జిల్లాల్లో 7,083 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.10,62,45,000 జమ కానున్నాయి.

మెరుగుపడుతున్న జీవన ప్రమాణాలు

కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి వరుసగా ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది ఠంచన్‌గా కాపు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా ఈ పథకం కింద నగదు విడుదల చేశారు. ఈ మొత్తంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక మంది మహిళలు ఇళ్ల వద్దే చిరు వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనోపాధులను మెరుగు పరచుకున్నారు.

> **మూడు విడతల్లో రూ.28.55 కోట్ల లబ్ధి**
>
> వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. 45 సంవత్సరాలు నిండి 60 సంవత్సరాలు పూర్తి కాని కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు మూడు విడతల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 19,039 మంది లబ్ధిదారులకు రూ. 28,55,85,000 విడుదలయ్యాయి.
>
> – ఏ నాగేశ్వరరావు, ఈడీ, బీసీ కార్పొరేషన్

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు ...

నియోజకవర్గం	లబ్ధిదారులు	జమ కానున్న మొత్తం (రూ.)
ఆదోని	234	35,10,000
ఆలూరు	74	11,10,000
కోడుమూరు	193	28,95,000
కర్నూలు	325	48,75,000
మంత్రాలయం	35	5,25,000
ఎమ్మిగనూరు	67	10,05,000
పత్తికొండ	321	48,15,000
పాణ్యం	261	39,15,000
ఆళ్లగడ్డ	1,327	1,99,05,000
బనగానపల్లె	955	1,43,25,000
డోన్	1,075	1,61,25,000
నందికొట్కూరు	295	44,25,000
నంద్యాల	960	1,44,00,000
శ్రీశైలం	674	1,01,10,000
పాణ్యం	287	43,05,000

సచివాలయాల్లో నోటరీ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో అడ్వకేట్ నోటరీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నన్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం జెడ్పీలోని తన ఛాంబర్‌లో కర్నూలు, ఆదోని డీఎల్‌డీఓలతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 672 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయని, వీటిని క్లస్టర్లుగా ఏర్పా టు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 63 మంది నోటరీలు ఉన్నారని, ప్రజలకు నోటరీ సేవలను అందించేందుకు ఆయా క్లస్టర్ల పరిధిలో ఒక అడ్వొకేట్ నోటరీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఒక్కో నోటరీకి 10 సచివాలయాలు వచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వీరు ఆయా సచివాలయాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం సర్వీసు చార్జీలను వసూలు చేసుకోవచ్చన్నారు. రాబోయే రోజుల్లో ఈ-స్టాంప్స్ కూడా సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. డీఎల్‌డీఓలు బాలక్రిష్ణారెడ్డి, నాగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం చరిత్రాత్మకం



వర్చువల్‌గా సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వింటున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో ఒకేసారి ఐదు మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించడం చరిత్రాత్మకమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ అన్నారు. కొత్తగా ఏర్పాటైన ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను విజయనగరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని వర్చువల్‌గా కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో స్క్రీన్‌ల ద్వారా అధికారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు శుక్రవారం తిలకించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రారంభంతో వైద్యసీట్లు రాష్ట్రంలో రెట్టింపయ్యాయన్నారు. పీజీ సీట్లను సైతం ప్రభుత్వం పెంచిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో మరో 12 కొత్త మెడికల్ కాలేజీలు రాబోతున్నాయని, దీంతో ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కాలేజీలను ఏకకాలంలో తీసుకువచ్చినట్లవుతుందన్నారు. ఇది వైద్యవిద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వీటి ఏర్పాటుతో వైద్య ప్రమాణాలు సైతం పెరుగుతాయని, మారుమూల ప్రాంతాలకు వైద్యవిద్య విస్తరిస్తుందని చెప్పారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంతో పాటు పాడేరు, పార్వతీపురం లాంటి ప్రాంతాల్లోనూ వైద్య విద్యను అందించడం ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. వైస్ ప్రిన్సిపాల్‌డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ వరకు ఎస్సార్బీసీకి నీరు

- రైతులు ఆందోళన చెందొద్దు
- నీటిని పొదుపుగా వాడుకోవాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ ఆయకట్టుకు డిసెంబర్ నెలాఖరు వరకు సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పాణ్యం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ముందుచూపుతో గోరుకల్లు జలాశయంలో ఈ ఏడాది తొమ్మిది టీఎంసీల నీరు నిల్వ చేశామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా నిశ్చింతగా పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. గోరుకల్లు కట్ట కుంగిన వెంటనే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టామన్నారు. సీమకే గుండెకాయగా భావించే గోరుకల్లు రిజర్వాయర్ పనులను అత్యంత పటిష్టంగా మూడు నెలల పాటు గ్రీన్‌కో సహయంతో పూర్తి చేశామన్నారు. ఇంజినీర్లు నిత్యం పనుల వద్దనే ఉండి పర్యవేక్షణ చేపట్టారన్నారు. ప్రతిక్షణం సమీక్షించి పనులపై ఆరా తీశామన్నారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించామన్నారు. ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో మాజీ జెట్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి.. భజేహం!



వాతావరణ కాలుష్యం లేకుండా వినాయక చవితి పండుగను ప్రకృతి హితంగా జరుపుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు సూచిస్తున్నారు. ఈ కోవలోనే కర్నూలు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులు శుక్రవారం మట్టి వినాయకులను తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలతో ఎలాంటి అనర్థాలు కలుగుతాయో వివరించారు. - సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

పవన్‌కు కావాల్సింది ప్యాకేజీ మాత్రమే

- ఆయనకు సిద్ధాంతం, జెండా, అజెండా లేదు
- జనసేనను టీడీపీకి తాకట్టుపెట్టారు
- చంద్రబాబు తన నిజాయితీని నిరూపించుకోవాలి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు సిద్ధాంతం, జెండా, అజెండా ఏమీ లేదని, ఆయనకు కావాల్సింది కేవలం ప్యాకేజీ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య విమర్శించారు. జనసేనను టీడీపీకి తాకట్టు పెట్టారని, 2024 ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేవని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్ లాంటి నీచపు బుద్ధి ఉన్న నాయకుడు ఉండడంతో సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. తప్పు చేస్తే ప్రశ్నిస్తానని అంటూ అవినీతి, అక్రమాల కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. జనసేన పార్టీ పెట్టింది ప్రశ్నించడానికి కాదని, కేవలం చంద్రబాబుకు అండగా ఉండడానికేనని పవన్ వ్యవహార శైలిని చూస్తే అర్థమవుతోందన్నారు. ఆయన తీరును గమనించిన ప్రజలు 2019 ఎన్నికల్లో రెండు చోట్ల ఓడించినా మార్పు రాలేదన్నారు. చంద్రబాబు అవినీతి, అక్రమాల్లో పవన్‌కు వాటా ఉందని, అందుకే ఆయన సొంత కుమారుడు లోకేష్ కంటే ఎక్కువ ఓవర్ యాక్షన్ చేస్తున్నారని విమర్శించారు.

పునరాలోచనలో జనసైనికులు

టీడీపీతో పొత్తు పెట్టుకోవడాన్ని జన సైనికులు హర్షించడం లేదన్నారు. చాలా మంది పునరాలోచనలో ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఈర్ష్య, ద్వేషంతో రగలిపోతూ జనసేన పార్టీని టీడీపీకి తాకట్టుపెట్టారన్నారు. జనసేన, టీడీపీ పొత్తును పిచ్చి చేష్టగా కొందరు జనసైనికులు అభివర్ణిస్తున్నారన్నారు. గతంలో పవన్ కల్యాణ్ అన్న చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించి కాంగ్రెస్‌లో కలిపివేశారని, జనసేనను కూడా పవన్‌కల్యాణ్ ఏదో ఒక రోజు టీడీపీలో కలిపి వేస్తారని జోస్యం చెప్పారు. చంద్రబాబు నాయుడు అరెస్టును సానుభూతిగా వాడుకునేందుకు చూస్తున్నా ఆ పార్టీ నాయకుల నుంచే స్పందన లేదన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అచ్చెన్నాయుడు ఆదేశాలు ఇస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. చంద్రబాబునాయుడు పదే పదే తాను నీతిమంతుడిని చెప్పుకున్నారని, ఇప్పుడు కోర్టులో నిరూపించుకోవాలన్నారు. భవిష్యత్తులో చంద్రబాబు, లోకేష్.. అమరావతి భూములు, అమరావతి ఇన్నర్ రింగురోడ్డు, ఫైబర్, ఐటీ కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ మాట్లాడుతూ..చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎప్పుడూ కలిసే ఉన్నారని, వారి పొత్తులో ఏమీ విశేషం లేదన్నారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, శాలివాహన కార్పొరేషన్ డైరక్టర్ గోపాలురెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, పెరుగు శ్రీనవాసులు రెడ్డి, దేవపూజ ధనుంజయాచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ సలహా మండలి(డీఏఏబీ) సమావేశం ఈ నెల 16న జరుగనుంది. డీఏఏబీ చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. డీఏఏబీ, నీటిపారుదల సలహా మండలి(ఐఏబీ) సమావేశాలను కలిపి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లుగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ముందస్తు రబీ పంటల సాగు, కాల్వల కింద ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ పాల్గొంటారన్నారు.

పొలంలో పేద రైతుకు వజ్రం లభ్యం

- రూ.8లక్షలకు వ్యాపారి కొనుగోలు

తుగ్గలి: అదృష్టం ఓ పేద రైతు ఇంటిని వజ్రం రూపంలో తలుపుతట్టింది. మండలంలోని జొన్నగిరిలో శుక్రవారం పొలంలో గుంటక పాస్తుండగా ఓ రైతుకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. దాదాపు నాలుగున్నర క్యారెట్లు ఉన్న ఈ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.8లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తొలకరి వర్షాలకు ఇక్కడ వజ్రాలు తళుక్కుమని మెరుస్తుంటాయి. గత 50 ఏళ్లకు పైగా ఈ ప్రాంతంలో వజ్రాలు లభ్యమవుతున్నాయి. ఏటా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక రాష్ట్రం నుంచి వజ్రాన్వేషణకు ఈ ప్రాంతానికి జనం వస్తుండటం విశేషం.

855.60 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటిమట్టం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 855.60 అడుగులకు చేరుకుంది. జూరాలలో విద్యుత్ ఉత్పత్తిని మధ్యాహ్నం నుంచి నిలిపివేయడంతో, జలాశయానికి వరద ప్రవాహం నిలిచి పోయింది. గురువారం నుంచి శుక్రవారం వరకు దిగువ ప్రాంతాలకు 5,738 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 0.193 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



క్లుప్తంగా

న్యాయస్థానాలకు 18న సెలవు

కర్నూలు(లీగల్): న్యాయస్థానాలకు ఈనెల 18 సోమవారం వినాయక చవితి సెలవును హైకోర్టు శుక్రవారం ప్రకటించింది. గతంలో 19వ తేదీన సెలవుగా ఉండేది. తాజాగా సోమవారమే వినాయక చవితి పండుగగా ప్రకటించడంతో 19న ఉన్న సెలవును 18వ తేదీకి మారుస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సోమవారం నాటి కేసులు మంగళవారం విచారిస్తారు.

సీనియర్ సివిల్ జడ్జి సుజాతకు పదోన్నతి

కర్నూలు(లీగల్): ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.సుజాతకు అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. ఆమెను కృష్ణా జిల్లా మచిలీ పట్నం మహిళా కోర్టు న్యాయమూర్తిగా నియమించారు. రాష్ట్రంలో 22 మంది సీనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి కల్పించి, వారికి స్థానాలు కేటాయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

18న మిర్చి మార్కెట్‌కు సెలవు

నంద్యాల(సెంట్రల్): వినాయక చవితి సందర్భంగా ఈ నెల 18న సోమవారం మిర్చి మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు టెక్కె మార్కెట్‌యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన శుక్రవారం తెలిపారు. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించి తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దన్నారు. మంగళవారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(అర్బన్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 29 నుంచి నెల రోజుల పాటు కొనసాగనున్న శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గొర్రెల కాపరే దొంగ

జూపాడుబంగ్లా: యజమానుల కళ్లుగప్పి కాపరే గొర్రె పిల్లలను అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. తాటిపాడు గ్రామానికి చెందిన పెద్దహుసేనాలం కుమారుడు మాలిక్‌బాషా పగిడ్యాల మండలం ఘణపురం గ్రామానికి చెందిన మల్లయ్య ఇంట్లో జీవాలను మేపేందుకు ఏడాదికి రూ.1,20,000 నగదుకు జీతం కుదిరాడు. అప్పులు చెల్లిస్తానని యజమాని వద్ద నుంచి ముందే జీతం తీసుకొన్నాడు. యజమానుల కళ్లు గప్పి గొర్రె పిల్లలు దొంగతనం చేసి తాటిపాడు, ఇతర గ్రామాల్లో విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. యజమానులు ప్రశ్నిస్తే కుక్కలు ఎత్తుకెళ్లాయేమోనని నమ్మబలికేవాడు. శుక్రవారం ఘణపురం గ్రామానికి చెందిన జీవాల యజమానులు తాటిపాడు గ్రామానికి చేరుకొని గొర్రెల పిల్లలను పరిశీలించి అవి తమవిగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గొర్రెల పిల్లలను స్వాధీనం చేసుకొని జీవాల యజమానులకు అప్పగించారు. గొర్రెల పిల్లలను దొంగతనం చేసి విక్రయించిన మాలిక్‌బాషా పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు.

ఆరుతడైతే ఆనందంగా నీరిస్తాం

- వారబందీతో మూణ్నెల్లపాటు సాఫీగా ఇవ్వగలం
- నిరంతరంగా సాగునీరిస్తే అక్టోబర్ 15కే వరకే సాధ్యం
- సాగునీటి విడుదలపై జిల్లా జలవనరుల శాఖాధికారి వెంకట రమణయ్య
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి.. మంత్రి అంజాద్‌బాషా
- సకాలంలో నీరిచ్చి పంటలను కాపాడాలి.. ప్రజా ప్రతినిధులు
- వాడీవేడిగా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి

నంద్యాల(సెంట్రల్): సాగునీటి విడుదల విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కించటం సరికాదని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాలు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వాడీవేడిగా జరిగి ఫలవంతంగా ముగిశాయి. ప్రజా ప్రతినిధులు తమ ప్రాంతాల్లో సాగునీటి అవసరాలు, చెరువుల మరమ్మతులు, ప్రత్యామ్నాయ పంట విత్తనాలపై పలు సందేహాలు లేవనెత్తగా అధికారులు సమాధానాలిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాగాణి సాగు వద్దని రైతన్నలకు విస్తృతంగా అవగాహన కల్పించటంతో పాటు ఆరుతడి పంటలకు సక్రమంగా నీరిచ్చి రైతులను ఆదుకోవాలన్న ఏకాభిప్రాయం వ్యక్తమైంది. కేసీ కింద ఇప్పటికీ రైతులు వరిసాగు చేస్తున్నారని, అన్నదాతలకు సరైన అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్ బాషా అధికారులకు సూచించారు. జిల్లా జనవరుల శాఖాధికారి వెంకట రమణయ్య మాట్లాడుతూ...వారబందీ ప్రకారమైతే ఇప్పుడున్న నీటి నిల్వలతో 3 నెలల పాటు 4 తడులు ఇబ్బంది లేకుండా అందించవచ్చని వెల్లడించారు. దీనికోసం 10 రోజులు ఆన్, 10 రోజులు ఆఫ్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. నిరంతరంగా సాగునీరు విడుదల చేస్తే అక్టోబర్ 15వ వరకే సాధ్యమవుతుందని, ఈ విషయాన్ని రైతులు పరిగణనలోకి తీసుకుని సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, డీఆర్వో పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు, కేసీ డీఈ సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీని విస్మరిస్తున్నారు



మొదట్లో ఉన్న ఆయకట్టుకు నీరివ్వకుండా మల్యాల మోటార్లు ఆన్‌చేసి ఎక్కడికో నీరు తీసుకుపోతున్నారు. సీఎం హామీ మేరకు గత నెలలో కేసీ ఆయకట్టుకు నీరిచ్చాం. దీంతో కేసీ కింద పైర్లు వివిధ దశల్లో ఉన్నాయి. అవకాశం ఉన్నా... కింద ఉన్న ముచ్చుమర్రి నుంచి కేసీకి నీరు ఎందుకు సరఫరా చేయటం లేదు? రైతులు ధర్నాలు చేసి ఒత్తిడి చేస్తేనే స్పందిస్తారా?. వెంటనే కేసీకి నీరందించి ఆదుకోవాలి.

– తొగురు ఆర్థర్, ఎమ్మెల్యే, నందికొట్కూరు

టీడా కంపెనీపై చర్యలు తీసుకోండి



కేసీ ఆయకట్టుకు ఇప్పుడు అరకొరగా నీరందిస్తున్నారు. మళ్లీ వారబందీ అంటే అయ్యే పనేనా? సిద్ధాపురం ఎత్తిపోతల మరమ్మతుల్లో భాగంగా ఎలివేటెడ్ విద్యుత్ లైన్ ఏర్పాటుపై అధికారుల తీరు నిర్లక్ష్యపూరితంగా ఉంది. వెలుగోడు మండలంలో పత్తి రైతుల్ని మోసం చేసిన టీడా కంపెనీ ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకుని అన్నదాతలకు కలెక్టర్ న్యాయం చేయాలి.

– శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీశైలం

2,300 క్యూసెక్కులు వదలాలి



తెలుగుగంగకు ప్రస్తుతం విడుదల చేస్తున్న 1500 క్యూసెక్కులతో అహోబిలం వరకు కూడా నీరు చేరదు. నీటి పరిమాణాన్ని 2,300 క్యూసెక్కులకు పెంచితేనే చాగలమర్రి పరిసర ప్రాంతాల్లోని 30వ బ్లాకు చివరి ఆయకట్టు వరకు నీరందే అవకాశం ఉంటుంది. వరిసాగు తగ్గి ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణం పెరిగే అవకాశముంది. రాయితీ కంది విత్తనాల్ని 1500 క్వింటాళ్ల నుంచి 3వేల క్వింటాళ్లకు పెంచి పంపిణీ చేయాలి.

– గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

మైనింగ్ ఫండ్ విడుదల చేయండి



భీమవరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇప్పటి వరకు రైతులే నిర్వహణా ఖర్చులు భరించేవారు. కానీ ఇటీవల పథకంలో భాగమైన రెండు పంపులు చెడిపోయాయి. మరమ్మతుల ఖర్చు సుమారు రూ.15 లక్షల దాకా అవుతుందని అంటున్నారు. ఇంత ఖర్చు అన్నదాతలు భరించలేరు. కలెక్టర్ గారు స్పందించి జిల్లా మైనింగ్ ఫండ్ నుంచి నిధులు కేటాయించి ఆదుకోవాలి.

– శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

ఉద్యాన పంటల్ని ప్రోత్సహించండి



జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వరి సాగు భారీగా తగ్గటంతో ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, క్యాస్టర్ తదితర పంటల వైపు రైతుల్ని మళ్లించాలి. అలగనూరు జలాశయం మరమ్మతులకు సంబంధించి సంబంధిత అనుమతుల్ని వేగంగా సాధించి పనులు మొదలు పెట్టాలి. – పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎంపీ, నంద్యాల

ఉద్యాన పంటల్ని ప్రోత్సహించండి



ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి రాయితీ విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి. రైతులు ప్రభుత్వానికి సహకరిస్తూ ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలి. పరిమితంగా ఉన్న సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి. లక్ష్యం మేరకు నాలుగు తడులు అందించి పంటలను కాపాడుతాం.- వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

వ్యవసాయ సహాయకులు నిర్లక్ష్యం వీడాలి

వర్షాభావ పరిస్థితులు పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో రైతుల్ని ఆరుతడి పంటలు వేసుకోవాలని అవగాహన కల్పించాల్సిన వీఏఏలు ఆ వైపుగా దృష్టి సారించటం లేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. తెలుగుగంగ ద్వారా నీటి విడుదలను పెంచి చివరి ఆయకట్టు వరకు నిరాటంకంగా సాగునీరు సరఫరా చేయాలి.

– గంగుల ప్రభాకర్‌రెడ్డి, జలవనరుల సలహాదారు

వారికి రైతుభరోసా వర్తింపజేయాలి

గడివేముల మండలంలో తరాలుగా ఇనాం భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు రైతుభరోసా సహా ఎటువంటి వ్యవసాయ సంక్షేమ పథకాలు అందటం లేదు. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి న్యాయం చేయాలి. కుందూ విస్తరణ పనుల్లో నెలకొన్న అయోమయానికి అధికారులు వివరణ ఇవ్వాలి. గడివేముల మండలం పెసరవాయి, పాణ్యం మండలం భూపనపాడులో కావేరి సీడ్స్ బాధిత రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

ప్రత్యామ్నాయ పంట విత్తనాల కేటాయింపు పెంచాలి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశముంది. కోవెలకుంట్ల సబ్‌డివిజన్‌కు సంబంధించి 14,730 క్వింటాళ్ల శనగ విత్తనం కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ తక్కువ కాకుండా మంజూరు అయ్యే విధంగా చూడాలి. చెరువుపల్లి పథకం పూర్తయితే ఏళ్లు కావొస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవటం దురదృష్టకరం.

– కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యే, బనగానపల్లె

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

సాగునీటి విడుదల విషయంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సందేహాలు, సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రైతులు ఆరుతడి పంటలు వేసుకుని సహకరించాలి. కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం. ప్రాజెక్టుల మరమ్మతులకు సంబంధించి నిధుల కొరత లేదు.

–మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పాలనాధికారి, నంద్యాల

విశ్వ బ్రాహ్మణుల పక్షపాతి వైఎస్ జగన్

కర్నూలు(అర్బన్): విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశ్వ బ్రాహ్మణుల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయఆచారి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక బీసీ భవన్‌లో విశ్వ బ్రాహ్మణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవపూజ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశ్వ బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. విశ్వకర్మ జయంతిని ఈ నెల 17న తొలిసారి అధికారికంగా నిర్వహిస్తున్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి వేణుగోపాలక్రిష్ణ, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొలేటి శ్రీకాంతాచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, విశ్వబ్రాహ్మణ నేతలు విజయాచారి, సోమయ్య ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, సిద్దయ్య ఆచారి, ప్రభాకరాచారి, సుధాకరాచారి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విశ్వ బ్రాహ్మణ నేతలు

లంచం తీసుకున్నందుకు జైలుశిక్ష

కర్నూలు(లీగల్): ఒక వ్యక్తికి సంబంధించిన భూమి పరిహారం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయిన మహిళా జూనియర్ అసిస్టెంట్‌కు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు జడ్జి సునీత శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 సంవత్సరంలో డి.కిషోర్ నాయక్ అనే వ్యక్తికి సంబంధించిన భూమి భూసేకరణ కింద ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ప్రతిపాదనలు పంపేందుకు వైఎస్సార్ జిల్లా జీఎస్‌ఎస్ఎస్ (భూసేకరణ)లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే వై.ప్రమీల రూ.4 వేలు లంచం తీసుకుంటూ కడప ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కేసు విచారణలో జూనియర్ అసిస్టెంటపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కార్డుదారులందరికీ రాగులు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రేషన్ కార్డుదారులందరికీ రాగులు అందజేయాలని కర్నూలు జిల్లా జాయింట్‌కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పౌరసరఫరాలు, ఐసీడీఎస్ అధికారులతో ఆమె వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకే వెళ్లి అందజేయాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ వెంకటలక్ష్మమ్మ, సివిల్ సప్లై డీఎం షర్మిల, డీఎస్ఓ ఆచార్యులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూపాడు గ్రామంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు దూపాడు గ్రామంలో అద్దె ఇంట్లో నివశిస్తున్న బి.మురళీకృష్ణ (31) కడుపునొప్పితో బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో నొప్పి తట్టుకోలేక గురువారం ఇంటి పైకప్పుకు ఉన్న ఇనుప కొక్కీకి చీరతో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH | AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

శిబిరం చిరునామా

కర్నూలులో..
మాంటిస్సోరి స్కూల్, ఏ.క్యాంప్, కర్నూలు
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97053 47392

నంద్యాలలో..
శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎన్‌జీఓ కాలనీ, లలితా నగర్, నంద్యాల
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 99122 20581

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc. నర్సింగ్ అడ్మిషన్స్

■ఆన్‌లైన్ స్టార్ట్ (18th వరకు), ఓల్డ్ గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ B.Sc., (నర్సింగ్)కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Q : ఇంటర్ + AP EAPCET లో Any ర్యాంక్. సంప్ర: జి. మురళీ, సెల్ : 9030661651. ATP. [A.2731]

EDUCATION & TRAINING

■ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కర్నూల్‌లో డిప్లొమా లో ప్రభుత్వ సీట్లు. ఫోన్ : 8317680122 [HA.5401]

REAL ESTATE

PLOT FOR SALE

■ప్లాటు..ప్లాటు..కర్నూలు–నంద్యాల రోడ్‌లో హైవేకు సమీపంలో 2.75 సెంట్లు కేవలం 5 లక్షల నుండి 12 లక్షల వరకు నన్నూరు, పూడిచర్ల, ఓర్వకల్లు, తిప్పాయిపల్లెలో & డోన్ రోడ్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు దగ్గరలో ఉల్లిందకొండ హైవేకు దగ్గరలో 1 సెంటు 3.50 లక్షల నుండి 5 లక్షల వరకు. & కర్నూలు మున్సిపాలిటీ పరిధిలో 2 కి.మీ. దగ్గరలో ఎల్.పేట నందు 1 సెంటు 6 లక్షల నుండి 7.50 లక్షలు. అన్ని డెవలప్‌మెంట్స్ కలవు. సం.ప్ర:80746 66099,99899 96221 [L.780983]

■కర్నూలు–నంద్యాల రోడ్ నన్నూరు టోల్‌గేట్ వద్ద 2.75 సెంట్లు కేవలం 12 లక్షలు మాత్రమే. వివరాలకు సంప్ర: 93909 84769, 89195 70306 [L.780980]

■కర్నూలు – నంద్యాల రోడ్, ఓర్వకల్లులో జుడీషియల్ సిటీకి దగ్గరలో ఓపెన్ ప్లాట్లు & కర్నూలు–డోన్ రోడ్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు దగ్గర లో 3 సెంట్ల ప్లాట్లు కలవు. 99638 00314 [L.780981]

■పుల్లయ్య కాలేజ్ దగ్గర న్యూ వెంచర్ లగ్జరీ డూప్లెక్స్ హౌస్ & అపార్ట్‌మెంట్ : గణేష్ నగర్‌లో 28.90 లక్షలు మొదలు & నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో 2bhk 36 లక్షలు అమ్మకం కలదు. 90145 80500 [L.798786]

HOUSE FOR SALE

■Kuda Approval తో గణేష్‌నగర్‌లో పద్మాస్ రెసిడెన్సీ & నంద్యాల చెక్‌పోస్ట్ సేహ ఎక్సైజ్ అపార్ట్‌మెంట్స్‌లో 2BHK Flats, పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ మెయిన్ రోడ్డుకి లగ్జరీ 3BHK & Duplex Villas అమ్మకానికి కలవు. 90143 35313 [L.798787]

■కల్లూరు ఎస్టేట్, ఉమామహేశ్వరి నగర్‌లో 4 సెంట్లు (40x45) ఉత్తరం ఫేస్ ఇల్లు అమ్మబడును. బోరు, మున్సిపల్ వాటర్, కర్నూలు. ధర: 85 లక్షలు ఫైనల్. సం.ప్ర:94907 27245 [L.780971]

■కర్నూలు–నందికొట్కూరు రోడ్ పుల్లయ్య కాలేజి వద్ద మెయిన్ రోడ్ కుడా అప్రూవల్ కల్గిన వెంచర్ ఓపెన్ ప్లాట్లు & ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. 93909 84769, 89195 70306 [L.780979]

SERVICES

DISTRIBUTORS

■Wanted District Wise Stockists for European Sofa Fabrics, Wallpapers. Call: 9515030644. [QA.5920]

WANTED

■కర్నూలులో డోర్ టు డోర్ సేల్స్ ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు బాయ్స్ కావలెను. అనుభవం గల వారికి శాలరీ:12,000 వరకు. సం.ప్ర: 80746 72246. [L.780985]

■శ్రీ ఆనంద్ ట్రావెల్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్ మరియు షాప నందు భాగస్వామిగా వ్యక్తి కావలెను. సాయివసంత్ కాంప్లెక్స్, బిర్లా కాంపౌండ్, కర్నూలు. 93929 02787,94917 42730 [L.780973]

■జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ Recovery సంస్థలో పనిచేయుటకు ఆసక్తిగల యువకులు కావలెను. MALE (కలెక్షన్ & లేపో ఎగ్జిక్యూటివ్) కావలెను. Q: 10th - డిగ్రీ ✆ 77991 11097, 98857 95967. W/A 779911 1098 [O-191615]

■DEC INFRASTRUCTURE & PROJECTS (INDIA) PVT LTD., require Quantity Surveyor (QS) having 7 to 10 Yrs of Experience in Building Projects. Qualification : B.Tech or Diploma in Civil. Walk in interview : 15.09.2023 to 30.09.2023. Location: Jaganathagattu, Kurnool. Mobile No: 98859 17003, 93462 46032. Email: hr@decinfra.com, decjagannathagattu@gmail.com [L.798793]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12,000-35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA.608]

■హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్. Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA.612]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మరో 6 రోడ్లకు టెండర్ల ఆమోదం

కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు రోజుల క్రితం 75 కి.మీ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు రూ.27.75 కోట్లతో ప్రభుత్వం టెండర్లకు ఆమోదం తెలిపింది. శుక్రవారం మరో ఆరు ప్రాధాన్యత రోడ్లకు 71 కిలోమీటర్ల మేర మరమ్మతులు, నిర్మాణం కోసం రూ.18.40 కోట్లతో ప్రభుత్వం టెండర్లను ఆమోదించిందని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు విలేకరులకు తెలిపారు. పోలకల్ – ముడుమాల, నందికొట్కూరు – రామళ్లకోట, ఓర్వకల్లు – వెలుగోడు – గార్గేయపురం, కంపమల్లమెట్ట – గోవిందదిన్నె , పిన్నాపురం– నంద్యాల రోడ్డు , లింగాల వీరిపల్లె – రేగడగూడూరు – పాములపాడు –నంద్యాల రోడ్డు టెండర్లు ఆమోదం పొందిన రోడ్లలో ఉన్నాయన్నారు. త్వరలో పనులు జరుగుతాయని తెలిపారు.

పత్తిలో 'గులాబి' నివారణకు పి.బి. నాట్‌లు

- గూడూరు మండలం జూలకల్‌లో ప్రదర్శన క్షేత్రం

కర్నూలు(అగ్రికల్చర్): పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. పి.బి. నాట్లను పత్తి మొక్కలకు కట్టడం ద్వారా పురుగు ప్రత్యుత్పత్తిని నివారించవచ్చు. ఈ విధానం మొదట విదేశాల్లో, తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విజయవంతం అయ్యింది. పెస్టిసైడ్ ఇండియా లిమిటెడ్ , సౌత్ ఆసియన్ బయోటెక్నాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో కూడా ప్రయోగాత్మకంగా పీ.బి నాట్లతో గులాబీరంగు పురుగు ప్రత్యుత్పత్తిని అరికట్టడానికి గూడూరు మండలం జూలకల్ గ్రామంలో 60 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు.

సామూహికంగా వినియోగించాలి

ఎవ్వరికి వారు విడివిడిగా పి.బి. నాట్‌లను వినియోగించడం వల్ల ఉపయోగం ఉండదు. సామూహికంగా మధ్యలో ఎలాంటి ఇతర పంటలు లేకుండా మొత్తం పత్తి ఉన్నపుడు మాత్రమే వీటిని వినియోగించాలి. జూలకల్ గ్రామంలో ఒకేచోట 60 ఎకరాలు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పత్తి పంట ఉంది. అందు వల్ల ఇక్కడ ప్రయోగాత్మకంగా గులాబి పురుగు ప్రత్యుత్పత్తి నిరోధక సాంకేతికతను వినియోగించారు. పి.బి. నాట్ అనేది 25 సెం.మీ పొడవు కలిగిన ఒకవైర్ లాంటి ప్లాస్టిక్ దారం. ఇందులో ఆడ రెక్కల పురుగు విడుదల చేసే వాసన దాదాపు ఒక దారంలో 168 మిల్లీ గ్రాములు కృత్రిమంగా నిక్షేపం చేసి ఉంటారు. ఇది సాధారణ ఆడ రెక్కల పురుగు విడుదల చేసే వాయువు కంటే కొన్ని రెట్లు అధికంగా ఉంటుంది. ఇటువంటి పి.బి నాట్‌లను పత్తి పంట చుట్టూ మొక్క విడిచి మొక్కకు కట్టాల్సి ఉంది. పంటలోపల ప్రతి 5 మీటర్ల దూరానికి ఒకటి ప్రకారం మొక్కల పైభాగంలో చుట్టాలి. పైరు 35–40 రోజుల దశలో పి.బినాట్‌లను కడితే 100 రోజులు దీని ప్రభావం ఉంటుంది. పి.బి. నాట్‌ల వినియోగం వల్ల కృత్రిమంగా విడుదల అయిన ఆడ పురుగు వాసన మగ పురుగును తికమక పడుతుంది. ఆడపురుగును కనిపెట్టడంలో విఫలమైన మగ పురుగులు రెండు రోజుల్లో చనిపోతాయి.


పత్తి మొక్కకు కట్టిన పి.బి. నాట్

గులాబిరంగు పురుగు నివారణ కోసం పత్తిలో పి.బి. నాట్‌లను సామూహికంగా వినియోగించేందుకు జూలకల్ గ్రామ రైతులు ఉత్సాహం చూపుతున్నారు. నంద్యాల వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త ఎం.శివరామకృష్ణ.

రైతుల ఉత్సాహం

కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 60 ఎకరాల్లో పి.బి. నాట్ ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. 60 ఎకరాలకు చుట్టూ మొక్క విడిచి మొక్కకు వీటిని కట్టారు. పైరులో ప్రతి 5 మీటర్లకు ఒకటి ప్రకారం ఎకరాకు 158 పి.బి.నాట్లను వినియోగిస్తున్నారు. ఈ విధానం విజయవంతం అయితే వచ్చే ఏడాది నుంచి వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉంది.

రూ.5 లక్షల చెక్కు అందజేత


రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కెనడాలో ఎంఎస్ చదువుతున్న కర్నూలు మండల వైస్ ఎంపీపీ2 నెహమ్యా కుమార్తె ముప్పసాని బేబి మౌనికకు జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం సాయంత్రం కర్నూలు నగరంలోని తన నివాసంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఈ చెక్కును వైస్ ఎంపీపీ2 నెహమ్యాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత చదువుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇస్తున్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి, విదేశీ విద్యా దీవెన అందజేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. కర్నూలు మండల వైస్ ఎంపీపీ2 మాట్లాడుతూ.. కోడుమూరు ఎమ్మెల్యే సహకారంతో జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకున్నామని, రూ.5లక్షలు చెక్కును అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సంపత్‌కుమార్, ముజమ్మిల్ తదితరులు పాల్గొన్నారు.



ఒత్తిడిని వదిలేయండి ఇలా...

ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్టపడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

ఆలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి. ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.

గోరువెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్‌రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయిల్ని తగ్గిస్తుంది.

ఆహారానికి సుగంధం ఆరోగ్యానికి అందలం



ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం... జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధారపడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...



అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.

యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది.



మధుమేహం నుంచి కాపాడుతుంది.



మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.



సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.



జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నానపెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నానపెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడకట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు ఆకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.

అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

- అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం
- మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం
- ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం
- గ్రీన్ టీ తీసుకోవడం
- రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం
- డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం
- ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం
- పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

"నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది'' అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. 'ఖుషి' సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు. ''కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది'' అన్నారు శివ నిర్వాణ. ''వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు నవీన్, రవిశంకర్.



- మృణాల్ ఠాకూర్

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పయ్యా ('ఆవారా')' సినిమాకు సీక్వెల్‌గా 'పయ్యా 2' రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే 'పయ్యా 2' సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో 'ఆర్చీస్' అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ''క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



- రక్షిత్, రుక్మిణి



- ఖుషీ కపూర్

ప్రేమకథ విన్నారా?

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ 'మామ్' తీసిన దర్శకుడు రవి ఉడయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

ఆ రోజు కీడా కోలా



- బ్రహ్మానందం

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు–నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



- వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'గం..గం.. గణేశా'. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. 'బేబీ' తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, 'గం..గం..గణేశా' చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు. ''ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు వంశీ కారుమంచి. 'ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది'' అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మిస్టర్ ఇడియట్'లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ''మిస్టర్ ఇడియట్' ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరీ రోణంకి. ''నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.



- మాధవ్, సిమ్రాన్ శర్మ



- పంఖురి, నవదీప్

అందాలు చదివే కళ్లకైనా...

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్ల కదిలే గుండెకైనా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కృష్ణన్ పాడారు. ''లవ్ మౌళి' షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం'' అని యూనిట్ పేర్కొంది.